బి. శ్రీవల్లీ రాధిక

# శవయాత్ర

చైతన్య, నేనూ విజయవాడకి వచ్చి యివాళ్టికి రెండురోజులయింది. ఇక్కడ మా ఫ్యాక్టరీలోని మెషీన్ ఒకటి పాడవడంతో ప్రొడక్షన్ ఆగిపోయింది. మెషీన్ సర్వీసింగ్‌కి వచ్చాం యిద్దరం.

ఆరుగంటలకల్లా పని అయిపోయింది. వెంటనే వెళ్ళిపోదాం అనుకుని హోటల్ రూం ఖాళీ చేసి హడావిడిగా బస్‌స్టాప్‌కి బయలుదేరాం. తీరా రిషా ఎక్కాక చూస్తే వాతావరణం బాగా లేదు.

ఆకాశం అంతా నల్లని మేఘాలతో క్రప్పబడి వుంది. ఏ క్షణంలోనైనా వర్షం వస్తుంది అనిపించేలా వురుములూ, మెరుపులూ..

"బాగా పెద్ద వర్షం వచ్చేట్లుందిరా!" అన్నాను నేను. నాకు వర్షం అంటే చిరాకు.

వాడేం మాట్లాడలేదు. ఏదో దీర్ఘాలోచనలో మునిగిపోయి వున్నాడు.

నేను నిట్టూర్చాను. నా మాటలు వాడికి విసుగు. వాడి మౌనం నాకు విసుగు.

ఒకప్పుడు చైతన్యతో ప్రయాణం అంటే ఎంతో ఆనందంగా వుండేది. దారిపొడుగునా వాడు చెప్పే జోక్స్, కనిపించిన ప్రతి విషయం గురించీ వివరణ, ఆ వివరణలో బయటపడే వాడి అద్భుతమైన విజ్ఞానం.. అసలు ప్రయాణం చేసినట్లే వుండేది కాదు.

"వీడిలోని ఆ హుషారంతా ఏమయిపోయిందా!" అనిపిస్తుంది యిపుడు వాడి పద్ధతి చూస్తే . ఒక్కోసారి చాలా చిరాకేస్తుంది.

మళ్ళీ "ప్రాణ స్నేహితుడిని నేనే అర్థం చేసుకోలేకపోతే యింకెవరు చేసుకుంటారు!" అనిపిస్తుంది.

అయినా ఎన్నాళ్ళిలా! నాకు తెలుసు. వాడి హృదయానికి భరించలేని గాయమే అయింది. అయితే "ఎంతకాలమని దాన్నే తల్చుకుంటూ, కుమిలిపోతూ వుంటాడు!" అనిపిస్తుంది.

నేను ఆలోచనలలో వుండగానే బస్టాప్ వచ్చింది. రిక్షా దిగి నాలుగడుగులు వేసిన నేను, చైతన్య నాతో పాటు రాకపోవడం గమనించి వెనక్కి తిరిగాను.

అక్కడ వాడు.. స్థంభంలా నిలబడి వున్నాడు, ఎటో చూస్తూ.

నాకు విపరీతమయిన చిరాకు వేసింది. విసురుగా దగ్గరికెళ్ళి "ఏమిట్రా" అన్నాను.

వాడు దూరంగా వున్న ఓ బస్ కేసి చూపిస్తూ అన్నాడు "ఆ బస్ ఎక్కుదాం" అని.

వీడికేమయినా పిచ్చెక్కిందా అనిపించింది నాకు.

ఆశ్చర్యంగా చూస్తున్న నా భావం గ్రహించినవాడిలా అన్నాడు మెల్లగా "కాంచన వాళ్ళ వూరు." వాడి కంఠం వణికింది "నాలుగేళ్ళ క్రితం నా ఆనందాన్నీ, నా కలలనీ, నా భవిష్యత్తునీ, నా సమస్తాన్నీ పూడ్చి పెట్టి వచ్చిన వూరు"

నేను ఆలోచిస్తుండగానే వాడు " పద" అంటూ ముందుకి కదిలాడు. నాకు అనుసరించక తప్పలేదు.

బస్ ఎక్కాక మెల్లగా అడిగాను " ఎక్కడుంటాం రా, ఆ పల్లెటూర్లో! " అని.

"కాంచన వాళ్ళ అన్నయ్యలున్నారక్కడ" అన్నాడు వాడు ముక్తసరిగా. అంతే. ఆతర్వాత ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు.

మూసుకున్న ఆ కళ్ళ వెనుక ఏముందో నాకు తెలుసు. నా ఆలోచనలు గతంలోకి సాగాయి.

ఆరోజు..

కాంచన మా ఆఫీస్‌లో యింటర్వ్యూకి వచ్చింది. ఆ జాబ్‌కి మగవాళ్ళని ప్రిఫర్ చేస్తారు. అందుకే ఆడవాళ్ళు ఎవరూ రారనుకున్న మేము కాంచనని చూసి ఆశ్చర్యపోయాం.

నాకసలే మొదటినుండీ అమ్మాయిలు కనిపిస్తే కామెంట్ చేయడం అలవాటు. ఆ అలవాటు ఎందుకు కలిగిందో, ఎలా పెరిగిందో గుర్తు లేదు. కానీ నాకు బోలెడంత గుర్తింపునిచ్చింది. ఆఫీసులో నేను పేర్లు పెట్టని లేడీ ఎంప్లాయీ లేదు.

అదే అలవాటుతో ఆరోజ కాంచన దగ్గరికి వెళ్ళి, ఈ జాబ్‌కి మగవాళ్ళనే తీసుకుంటారంటూ వ్యంగ్యంగా ఏదో అనబోయాను.

కానీ ఆమె తలెత్తి చూడగానే నివ్వెరబోయాను. ఆమె వదనంలో కనిపించే ఆ భావన.. దాన్నేమంటారు! ముగ్ధత్వమా! అందమా! ఆత్మవిశ్వాసమా! అసలు దానికి సరైన పేరుందా! అనిపించింది.

అంతలోనే సమాధానం దొరికింది. "ఎందుకు లేదూ! వుంది. అది స్త్రీత్వం" అని.

నాకింక మాటలు రాలేదు. "అసలు ఈమెనేమైనా అనడం ఏమిటి!" అనిపించింది.

అప్పటిదాకా ఆడవాళ్ళంటే ఒకరకమైన చులకన భావం వున్న నేను కాంచనని నా జీవితంలో మరెవరినీ గౌరవించనంతగా గౌరవించసాగాను.

నాలో మార్పు చూసి చైతన్య చాలా ఆశ్చర్యపోయాడు. వాడితో నేను "ఆమె నాకు మా అమ్మలా అనిపించిందిరా" అంటే పదినిమిషాలు ఆగకుండా నవ్వాడు.

వాడికి స్త్రీ అంటే గౌరవం వుందో లేదో నాకు తెలియదు కానీ చులకన భావం మాత్రం వుండేది కాదు. అసలు అమ్మాయిలంటే పెద్ద ఆసక్తి వుండేది కాదు.

ఎప్పుడూ తన పనేమిటో, తనేమిటో అన్నట్లు వుండేవాడు. పట్టుదల, ప్రావీణ్యం మూర్తీభవించినట్లుగా కనిపించేవాడు. నిజానికి మేమిద్దరం ఒకేసారి జాబ్‌లో చేరాం. కాని వాడు రెండు నెలలలోనే నాకంటే పెద్ద పోస్ట్‌లోకి వెళ్ళిపోయాడు.

బద్ధకం అంటే అసహ్యించుకునేవాడు చైతన్య. అచ్చంగా వాడి భావాలకు ప్రతిరూపంలా వుండేది కాంచన.

వాడిని ఇంప్రెస్ చేసిన మొట్టమొదటి స్త్రీ కాంచనే. ఆమె నన్నోరకంగా మారిస్తే వాడినో రకంగా మార్చింది. వారిద్దరిమధ్యా జనించిన ప్రేమ నాకెంతో ఆనందాన్నిచ్చింది.

ఏ విషయంలోనైనా వాళ్ళిద్దరి భావాలూ ఒకటిగానే వుండేవి. కాకపోతే ఒక్కటే తేడా. కాంచనకి దైవభక్తి వుండేది. చైతన్య దేవుడున్నాడని ఒప్పుకోడు.

అసలు బేసికల్‌గానే యింత వ్యతిరేకత వున్నపుడు మిగతా భావాలెన్ని కలిస్తే మాత్రం ప్రేమ ఎలా కలిగిందా! అనిపించేది నాకు.

ఒకసారి వాళ్ళతో అన్నాను జోక్‌గా "నీ నాస్తికత్వం ఆమెకు అనాచారంగానూ, ఆమె దైవభక్తి నీకు మూఢత్వంగానూ కనిపించవా!" అని.

నామాటలు విని "మూఢత్వం అంటే ఏంటండీ" అని అడిగింది కాంచన.

నేనేం సమాధానమివ్వాలో తెలీక తడబడ్డాను. "ఏ మహాత్ముని బోధలతోనూ మారనిది, మరణించి మంటలలో కాలుతున్నా వదలనిదీ మూఢత్వం. ఇపుడు మీరు అడిగారే.. అలా ఒకరి భావాలు మరొకరు ఒప్పుకోలేకపోవడమే మూఢత్వం. అవతలి వారి భావాల్లోని మంచిని గ్రహించలేకపోవడం, మన భావాలూ, అలవాట్లే గొప్పవనే నమ్మకంలో వుండడం మూఢత్వం. అది మాయిద్దరికీ లేదు. అది లేనపుడు దేవుడున్నాడా! లేడా! అన్నది పెద్ద సమస్య కాదు. కాకపోతే దైవభక్తి బలహీన మనస్కులని పాపాలు చేయకుండా కాపాడుతుంది కాబట్టి నేను దేవుడిని నమ్ముతాను.

ఏ క్షణంలోనూ చెడుకి లొంగని స్థిరత్వం, విచక్షణ ఆయనకున్నాయి కాబట్టి ఆయన దేవుడిని నమ్మకపోయినా పర్లేదు" అంది కాంచన.

ఆమె మాటలు విన్న చైతన్య కళ్ళల్లో మెరుపు చూసి నేను తృప్తిగా నిట్టూర్చాను. సంవత్సరం తర్వాత వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. వారి పెళ్ళికి ఏ అభ్యంతరాలూ ఎదురవలేదు.

ఆఫీసులో అందరం వాళ్ళ పెళ్ళి కోసం ఆత్రంగా ఎదురు చూశాం. రకరకాల ప్లాన్స్ వేసుకున్నాం.

కానీ అంతా మేమనుకున్నట్లుగా జరగలేదు. ఆరోజు ప్రొద్దున మామూలుగానే ఆఫీసుకి బయలుదేరి వస్తున్న కాంచనకి యాక్సిడెంట్ అయింది. దారుణమైన యాక్సిడెంట్.

యాక్సిడెంట్ అయిన అరగంట లోపే ప్రాణం పోయింది. ఆఫీస్‌లోని ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టారు. చైతన్య ఒక్కడే ఏడవలేదు. స్థాణువులా కూర్చుండిపోయాడు.

జరిగినదానిని నమ్మలేనివాడిలా చూశాడు. అంతవరకూ వాడికి జీవితంలో ఏ ఎదురుదెబ్బా తగలలేదు. కోరుకున్న ప్రతిదాన్నీ సాధించుకున్నాడు.

అన్నీ తన చేతుల్లోనే వున్నాయన్న ఆత్మవిశ్వాసంతో బ్రతికేవాడు. తనకి కావలసిన దానికి ఎవరి సహాయమో అర్థించడం, ఏ దేవుడినో ప్రార్థించడం లాంటివి వాడికి తెలీదు.

అందుకే వాడు ఆ భయంకర విషాదాన్ని ఎలా పూడ్చుకోవాలో, అందుకు ఎవరిని ఎదుర్కోవాలో తెలీక విలవిల్లాడిపోయాడు.

మేము కాంచన అన్నయ్యలకి వెంటనే కబురు తెలియచేశాం.

వాళ్ళు వచ్చాక చెప్పాడు చైతన్య. "కాంచన తన అంత్యక్రియలు వాళ్ళ వూర్లోనే జరిపించమని అడిగింది" అని. కాంచన మరణం తర్వాత వాడు మాట్లాడిన మొట్టమొదటి మాటలు అవే.

మేము శవాన్ని వాళ్ళ వూరు తీసుకువెళ్ళే ఏర్పాట్లు చేశాం. దుఃఖభారంతో వాళ్ళ అన్నయ్యలు బయల్దేరుతూండగా "నేనూ వెళ్తున్నాను" అన్నాడు చైతన్య.

సరేనన్నాను. కానీ చైతన్య వెళ్ళిపోయాక అనిపించింది, వాడితోపాటు నేను కూడా వెళ్తే బాగుండేదేమో! అని. రెండో రోజు సాయంత్రానికి తిరిగి వచ్చాడు వాడు. ఆ ఒక్క రోజులోనే అంతగా మారిపోయిన వాడి రూపాన్ని చూసి ఆశ్చర్యపోయాను.

"ఏరా! దహనం చేశారా!" అన్నాను.

"ఊఁ. పెళ్ళికాని వాళ్ళని పూడ్చిపెడతారటగా" అన్నాడు వాడు.

"ఎన్ని గంటలకెళ్ళారు ఆ వూరికి!" విషయాలన్నీ వివరంగా తెలుసుకోవాలని అడిగాను.

"సాయంత్రం ఆరున్నరైంది" వణికే కంఠంతో చెప్పాడు వాడు. " అక్కడో పెద్ద గొడవ. గుంట తీయడమయ్యాక తీరా శవాన్ని పూడ్చబోతూండగా రాత్రిపూట శవాన్ని పూడ్చకూడదంటూ వాదన లేవనెత్తారు"

"ఎవరు!" అన్నాను నేను ఆశ్చర్యంగా.

"ఎవరో ఆ వూర్లోవాళ్ళు"

వాడి చిరాకు చూసి "పోనీ తెల్లవారాకే చేయకపోయారా!" అన్నాను.

"ఎక్కడ! అంతసేపు వుంచడానికి ఆ పల్లెటూర్లో ఏర్పాట్లేమున్నాయి! అయినా ఒక గుంపు వచ్చి ఈ రకంగా గొడవ పెడితే, మరో గుంపు వచ్చి "లేదు, యిపుడే చేయాలి" అంటుంది. "శవం కోసం తీసిన గుంటని రాత్రిపూట అలా వదిలేయకూడదు. అరిష్టం" అని వాళ్ళన్నారు. ఇలా రెండు గంటలసేపు వాదన."

వాడు ఆవేశపడుతూండడం గమనించి, "మళ్ళీ ప్రొద్దున్నే బయల్దేరి వచ్చేశావా!" అన్నాను.

"ఊ. ప్రొద్దున లేచేసరికి మళ్ళీ యింకో గొడవ. రాత్రి హడావిడిలో వీళ్ళు గుంట సరిగా తీయించలేదో ఏమో కానీ తెల్లవారేసరికి కుక్కలు శవాన్ని బయటకి లాగాయి. ఇంక వూర్లో వాళ్ళంతా యింటిమీదకి వచ్చి దారుణంగా మాట్లాడసాగారు. ఆ మూఢత్వాన్ని, కొట్లాటలని చూడలేక నేను బయల్దేరి వచ్చేశాను."

వాడి సమాధానం విని "సరే. పోన్లే, అయిపోయిందిగా!" అంటూ ఓదార్చబోయాను నేను.

"అదికాదురా! శవయాత్రకి కూడా యిన్ని సిద్ధాంతాలా! మనిషి మరణించాక కూడా యిన్ని నియమాలా!" అంటూ బాధపడ్డాడు వాడు.

సంవత్సరాలు గడిచినా వాడి వేదన తీరలేదు.

"లే, ఊరొచ్చింది" అన్న చైతన్య మాటలకి వులిక్కిపడి చూశాను నేను. అప్పటికే వాడు బ్రీఫ్‌కేస్ తీసుకుని లేచాడు.

మేము కాంచన వాళ్ళ అన్నయ్య వాళ్ళిల్లు వెతుక్కుని వెళ్ళేసరికి తొమ్మిదిన్నర అయింది. ఆయనని నేను రెండుసార్లే చూశాను. కాంచన చనిపోయినపుడు ఒకసారి. ఆతర్వాత మరోసారి.. కాంచనకి రావలసిన డబ్బులవీ తీసుకోవడానికి మా ఆఫీసుకి వచ్చారాయన. అపుడు. ఆరోజు చెప్పాడాయన. చైతన్య వచ్చేశాక కూడా వూర్లో కొంత గొడవయిందట.

కాంచన అంత్యక్రియలు జరిగిన తర్వాత రెండురోజుల లోపలే ఆ వూర్లో తొమ్మిదిమంది దాకా యువకులు చనిపోయారట. "అందరూ మమ్మల్ని ఆడిపోసుకుంటున్నా"రంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడాయన.

"మీరవేం పట్టించుకోకండి" అని చెప్పి పంపాడు చైతన్య. రెండుసార్లే చూసినా వెంటనే గుర్తుపట్టాడాయన నన్ను కూడా. మమ్మల్ని ఆదరంగానే ఆహ్వానించారు వాళ్ళు. కానీ ఆ సమయంలో మమ్మల్ని చూసి చాలా ఆశ్చర్యపడ్డట్లుగా కనిపించారు.

ఆశ్చర్యపోతారని నేనూ అనుకున్నాను కానీ వాళ్ళ ప్రవర్తన ఆశ్చర్యానికి భిన్నంగా, కొంచెం అసహజంగా అనిపించింది. అయినా అపుడు నేనేం మాట్లాడలేదు.

కానీ తెల్లవారాక కూడా మళ్ళీ అదే పరిస్థితి. నాకు మా రాక వీళ్ళకేమైనా యిబ్బంది కలిగిస్తోందా! అనిపించింది.

చాలాసేపు చూసి చివరికి అదేమాట అడిగాను వాళ్ళని. "అబ్బే. అదేం లేదు బాబూ!" అన్నాడు వాళ్ళ పెద్దన్నయ్య వెంటనే.

"మరయితే అందరూ ఎందుకలా వున్నారు?" అన్నాను నేను వదిలిపెట్టకుండా.

ఆయన యిక తప్పదు అనుకున్నాడేమో మెల్లగా చెప్పసాగాడు. "ఆరోజు కాంచన శవాన్ని పూడ్చడంతో మొదలైన గొడవ ఈ వూరినింకా వదలలేదు బాబూ! ప్రతి సంవత్సరం సరిగ్గా ఆరోజు ఈ వూర్లో ఒక యువకుడు చనిపోతున్నాడు. ఆ పని కాంచన ఆత్మే చేస్తోందని, అందుకు కారణం మేమా రోజు అంత్యక్రియలు సరిగా నెరవేర్చకపోవడమేనని వూరు నమ్ముతోంది" అంటూ నిట్టూర్చాడాయన.

"ఏడిసింది" అన్నాడు చైతన్య. "ఊరు అర్థం పర్థం లేని నమ్మకాలు పెట్టుకుంటే ఎవరేం చేస్తారు! అయినా మీరంతా ఎందుకంతగా భయపడుతున్నారు!"

వాడి ఆవేశం గమనించి వాడినే పరీక్షగా చూస్తూ చెప్పాడాయన మెల్లగా.

"ఈరోజు ఆగస్ట్ యిరవై ఏడు కాబట్టి. నాలుగేళ్ళ క్రితం సరిగ్గా యిదేరోజు మనం యిక్కడ కాంచన శవాన్ని ఖననం చేశాం కాబట్టి" అని.

విపరీతమైన ఆశ్చర్యంతో వులిక్కిపడ్డాను నేను.

ఆ తర్వాత ఆయన చెప్పే విషయాలు ఒక్కొక్కటీ వింటూంటే నాకు మతిపోయింది. ఈ రోజున వూర్లోని యువకులెవరూ అన్నం తినరట.

పనులకి వెళ్ళరట. చావు ఏ రూపంలో వచ్చి తమని చుట్టుముడుతుందోనని భయపడుతూ యింట్లోనే కూర్చుంటారట.

"ఎంత మూర్ఖత్వం!" అనిపించింది నాకే. చైతన్య అయితే సరేసరి. చాలా ఆవేశపడ్డాడు.

కాసేపయాక యిద్దరం శ్మశానం వైపు వెళ్ళాం. చైతన్య చాలాసేపు కాంచన సమాధి దగ్గరే కూర్చుండిపోయాడు. వాడి మొహంలో చాలా రోజుల తర్వాత కనిపిస్తున్న ప్రశాంతతని గమనించి నేనూ వాడిని కదిలించలేదు. దాదాపు సాయంత్రం దాకా అక్కడే వున్నాం. చీకటి పడుతూండడంతో యిక వాడు కదిలేలా లేడని నేనే బలవంతంగా లాక్కొచ్చాను.

ఊర్లోకి రాగానే ఒకచోట కాంచన వాళ్ళ అన్నయ్యా, మరికొంతమందీ గుంపుగా నిలబడి మాట్లాడుకుంటున్నట్లు కనిపించడంతో మేమూ అటువైపు నడిచాం.

మేం వెళ్ళేసరికి ఎవరో ఒక ఆయన అంటున్నాడు "ఇప్పుడే నిశ్చింత ఎలా వస్తుంది! ఇంకా రోజు పూర్తి కాలేదుగా! ఈసారి ఎవరిని బలి తీసుకుంటుందో! ఏమో! ఆ మహమ్మారి" అని.

ఆమాటలు విన్న చైతన్య "ఒకప్పటి మీ వూరి మహలక్ష్మి ఈ రోజు దయ్యమెందుకయ్యిందండీ!" అన్నాడు.

ఆయన మావైపు చూసి చెప్పాడు "అంతే నాయనా! అసలే ఏ కోరికలూ తీరకుండా అంత చిన్న వయసులో చనిపోయిందా! దానికి తోడు అంత్యక్రియలూ అవకతవకగా జరిగాయి. మరి యిక ఆ ఆత్మ అలా తిరగక ఏమవుతుంది!"

ఆయన ఆ మాటలు ఆపకముందే మిగిలిన అందరూ కూడా తలా ఒకరకంగా వ్యాఖ్యానించసాగారు.

వాళ్ళు చెప్పేదాన్ని బట్టి అపుడు చనిపోయిన తొమ్మిదిమందీ, ఆ తర్వాత

చనిపోయిన యువకులూ అందరూ పూర్తి ఆరోగ్యవంతులు. దయ్యం కారణంగానే వాళ్ళు హటాత్తుగా చనిపోయారు.

నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించింది. కాంచనని గూర్చి అలా అంటుంటే బాధా కలిగింది. కానీ నాకు వాదించడం రాదు. అయినా అది అబద్ధమనీ, వాళ్ళు చనిపోవడానికి మరేదో కారణముండుంటుందనీ నిరూపించేందుకు మాదగ్గర ఆధారాలేమీ లేవు.

చైతన్య మాత్రం ఆవేదనతో, ఆవేశంతో వాదనలోకి దిగాడు. కాంచనలాంటి స్త్రీ చనిపోతే దేవత అవుతుంది కానీ దయ్యం కాదన్నాడు.

"ఇపుడు రాత్రి ఎనిమిది గంటలయింది. ఇక ఇవాళ ఏమీ జరగకపోతే మీరీ నమ్మకాలన్నీ వదులుకుంటారా!" అని అడిగాడు.

చాలా రోజుల తర్వాత మళ్ళీ వాడిలోని విజ్ఞానాన్నీ, వాదనా పటిమనీ చూశాను నేను. వాడిచ్చే ఉదాహరణలూ, వివరణలూ ఆశ్చర్యంగా విన్నాను.

కానీ వాడెంత వాదించినా, ఎంత చర్చించినా వాళ్ళ అభిప్రాయాలేమీ మారినట్లు కనిపించలేదు. దేవుడు లేడని నిరూపించడం కంటే దయ్యం లేదని అనిపించడం కష్టంలా తోచింది.

నాలాంటివాడిని ఒక్క చిరునవ్వుతో మార్చగలిగిన కాంచన గురించి వాళ్ళు అంత దారుణంగా మాట్లాడటం, ఆమెను ఓ కామినిపిశాచంలా వర్ణించడం చూస్తుంటే నాకే యింత బాధగా వుంది, యిక చైతన్య మనసు ఎంతగా మండుతూందో కదా! అనిపించింది.

"మీలోని మూఢత్వాన్ని వదలగొట్టి గానీ నేనీ వూరు వదలను" అంటున్నాడు చైతన్య.

ఇంతలో అటుగా వచ్చిన ఓ యువకుడు వూర్లో ఎవరికో ప్రమాదంగా వుందని చెప్తూ కాంచన వాళ్ళ అన్నయ్యతో కోపంగా ఏదో అన్నాడు.

అతని నోటినుండి వెలువడిన ఒక అనాగరిక పదానికి దెబ్బతిన్న త్రాచులా చూశాడు చైతన్య.

నేను వారించేలోపే విసురుగా వెళ్ళి అతని చొక్కా పట్టుకున్నాడు. అతనూ ఏమీ తీసిపోలేదు. మొరటుగా కొట్లాటకు దిగాడు. నాకు భయం వేసింది. అసలే బలహీనంగా వున్న చైతన్యని ఆ మొరటు వెధవ ఏం చేస్తాడో అనిపించింది. నేను చైతన్యని బలంగా లాగుతూ అన్నాను "ఏమిట్రా యిది! చదువుకున్న వాళ్ళు బిహేవ్ చేయాల్సిన పద్ధతేనా! ఇంత ఆవేశం ఏంటి నీకు!" అని.

వాడు వెంటనే తగ్గిపోయాడు. తన తప్పు గ్రహించినవాడిలా అతనిని వదిలేసి షర్ట్ సరిచేసుకుంటూ యివతలికి రాబోయాడు.

సరిగ్గా అప్పుడు.. అతను వెనక్కి తిరిగిన చైతన్యని మెడమీద చేయివేసి బలంగా తోశాడు. అంతే. వాడి తల విసురుగా వెళ్ళి షార్ప్‌గా వున్న ఓ రాయికి కొట్టుకుంది.

నేను పరుగెత్తాను. నేను వాడిని చేరుకునేసరికి ఒక్క క్షణం పట్టింది. ఆ ఒక్క క్షణమే వాడు ప్రాణాలతో వున్నాడు. నేను వాడిని వడిలోకి తీసుకోగానే తల వాల్చేశాడు. "చూశావురా! ఎంత మూర్ఖులో!" అవే వాడి ఆఖరి మాటలు.

వాడి మొహాన్ని గుండెలకి హత్తుకుని ఒక్కసారిగా విలపించాను నేను. ఒక ఊరి మూఢత్వాన్ని వదలగొట్టే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన నా మిత్రుడ్ని చూసి గుండెలు పగిలేలా రోదించాను.

అపుడు వినిపించాయి నా వెనుకనుండి ఆమాటలు. "పాపం అమాయకుడు! ఎంతసేపు వాదించాడు దయ్యం కాదూ లేదూ అంటూ. చివరికి తనే బలయ్యాడు"

ఒక మంచుబాణం మనసులో గ్రుచ్చుకున్నట్లూ, ఓ అగ్నికణికతో గుండెని పొడిచినట్లూ వినబడిన ఆ మాటలకి ఆపాదమస్తకమూ వణికాను నేను.

వాదనకి ముగింపు ఏదైనా వాదించేవాడు తనకు అనుకూలంగానే దాన్ని అర్థం చేసుకుంటాడని తెలిసి ఆశ్చర్యపోయాను.

అవును. చైతన్య మరణానికి కారణం వీరి మూర్ఖత్వమైతే ఆ మూర్ఖత్వానికి ఆలంబన కాంచన ఆత్మ.

"సరిగ్గా ఈ రోజుకి మేమిక్కడికి రావడం, చైతన్య మరణించడం.. నిజంగా యిదంతా కాకతాళీయమేనా! కాదు. కాంచన ఆత్మే కారణమనుకుంటే.. ఆమెకు చైతన్యని రప్పించుకునేందుకు నాలుగేళ్ళు పట్టిందా!

ఏది నిజం! ఏది అబద్ధం! ఒకవేళ నేను మరణించి చైతన్య బ్రతికి వుంటే వీరికి ఏం సమాధానం చెప్పి వుండేవాడు!

ఊహించే శక్తి లేని నేను "ఏ మహాత్ముని బోధలతోనూ మారనిదీ, మరణించి, మంటలలో కాలుతున్నా వదలనిదీ మూఢత్వం" అన్న కాంచన మాటలు మనసులో మెదుల్తుండగా చైతన్య శవయాత్రలో నడుస్తున్నాను.

*****

("ఆంధ్రభూమి" మాస పత్రిక - ఏప్రిల్ 1993)